## క్లుప్తంగా

### నేడు గడప గడపకు మన ప్రభుత్వం

సింగరాయకొండ: మండలంలోని సోమరాజుపల్లిలో ఈనెల 29వ తేదీ శనివారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు కలికవాయ ఫ్లైఓవర్ వద్ద నుంచి పకీరు పాలెం వరకు మోటారు సైకిల్ ర్యాలీ తదనంతరం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ముగింపు సందర్భంగా విలేకరుల సమావేశం, తరువాత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారన్నారు.

### సీఎం జగన్, బాలినేనికి కృతజ్ఞతలు

మద్దిపూడి: పొదిలి చిన చెరువు నుంచి మద్దిపూడి మండలం గుండ్లసముద్రం, మద్దిపూడి చెరువులకు పైపులైన్ ద్వారా తాగు, సాగునీరు అందించేందుకు రూ. 28.5 కోట్లు మంజూరుకు ప్రభుత్వం అనుమతించింది. దీంతో మండల ప్రజల తరఫున సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, సహకరించిన బాలినేనిశ్రీనివాసరెడ్డికి మద్దిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి శుక్రవారం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### సచివాలయాలపై నమ్మకం కలిగించాలి



సచివాలయ ఉద్యోగిని ప్రశ్నిస్తున్న ఎంపీడీఓ

వెలిగండ్ల: గ్రామ సచివాలయాలపై ప్రజలకు నమ్మకం కల్పించాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందని ఎంపీడీఓ టి. సుకుమార్ అన్నారు. మండలంలోని మొగళ్లూరు, వెలిగండ్ల, గోకులం, రామగోపాలపురం, రామలింగాపురం, ఇమ్మడిచెరువు, పి. రాళ్లపల్లి, పి. నాగులవరం, గుడిపాటిపల్లి గ్రామాల్లోని గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ టి.సుకుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుకుమార్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు సత్వరమే అందించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి షేక్ షకీల, విజయభాస్కర్‌రెడ్డి, మధు, ఏఎన్ఎం బి.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

### మార్కెట్‌కు అనుగుణంగా పొగాకు బేళ్లు తీసుకురావాలి



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: రైతులంతా మార్కెట్‌కు అనుగుణంగా గ్రేడింగు చేసి పొగాకు బేళ్లను వేలానికి తీసుకురావాలన్నారు. అలాగే కంపెనీ బయర్లను మంచి ధర ఇచ్చి పొగాకు రైతులను ఆదుకోవాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు కోరారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం జరిగిన వేలంలో తూర్పునాయుడుపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాలకి చెందిన రైతులు 1046 బేళ్ళను వేలాని తీసుకురాగా వాటిలో 995 కొనుగోలు జరిగగా, 51 పొగాకు బేళ్ల తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 200 కాగా, కనిష్ట ధర రూ. 160 పలకగా, సరాసరి రూ. 196. 06 ధర పలికింది. మొత్తం 19 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

### శతాబ్ది ఉత్సవాలు జయప్రదం చేయండి

సింగరాయకొండ: అఖిల భారత యాదవ మహాసభ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల రామారావు అన్నారు. స్థానిక కందుకూరు రోడ్డు సెంటర్ లోని యన్నాబత్తిన చిన్నా కార్యాలయం వద్ద శుక్రవారం మండల సమావేశం జరిగింది. నూతన అధ్యక్షులుగా దాసరి శేషయ్య, ఉపాధ్యక్షులుగా కోడిపల్లి బాబు, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల మాల కొండయ్య మరి కొంతమంది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి

వలేటివారిపాలెం: మండలంలోని వలేటివారిపాలెం గ్రామ శివారులోని ఆంజనేయస్వామి గుడి దగ్గర ఉత్తర దిక్కున ఉన్న పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పశువుల కాపారుల సమాచారం మేరకు ఎస్సై బి.మహేంద్ర నాయక్ తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతునికి 50 నుంచి 60 ఏళ్ల వయసు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మానుగుంట, సబ్‌కలెక్టర్ శోభిక

కందుకూరు: నవరత్నాల పేరుతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. గుడ్లూరు మండలంలోని దారకానిపాడులో శుక్రవారం రెండవ రోజు సబ్‌కలెక్టర్ శోభికతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లిన ఆయన పథకాలు అమలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందుకోవడంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అంటూ ఆరా తీశారు. అలాగే ప్రభుత్వం చెప్పిన విధంగా పథకాలకు సంబంధించిన నగదు అకౌంట్లలో జమ అవుతుందా లేదా అని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన పలువురు గ్రామస్తులు అన్ని సక్రమంగా వస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. పేదలను ఆర్థికంగా ఉన్నత స్థితిలో నిలపాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని చెప్పారు. ఈ లక్ష్య సాధన కోసం ప్రభుత్వం నవరత్నాల సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చడమే వీటి ఉద్దేశమని చెప్పారు. చెప్పిన సమయానికి కచ్చితంగా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని వివరించారు. గ్రామస్థాయిలో పాలన ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చారని, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిట్లోకి వచ్చాయన్నారు. దీని వల్ల ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బందులు లేకుండా పోయాయని వివరించారు. ఏ ఇబ్బంది వచ్చినా తాను అందుబాటులో ఉంటానని నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చునని చెప్పారు. ఎంపీపీ పులి రమేష్, జెడ్పీటీసీ కొర్సిపాటి బాపిరెడ్డి, సర్పంచ్ చిత్తారి చెంచమ్మ, ఎంపీటీసీ బొందల ప్రభాకర్, నాయకులు యరగొర్ల నరశింగరావు, గొర్ల నాగేశ్వరరావు, సుజాత, దేవకుమార్, చల్లా సిద్దయ్య, దగ్గుమాటి క్రిష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సింగరాయకొండ: గడప గడపకు మన ప్రభుత్వంలో వరికూటి

# సమస్యల పరిష్కారమే ధ్యేయం

సింగరాయకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించటానికి అవకాశం ఏర్పడిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. మండలంలోని బింగినపల్లి గ్రామంలో శుక్రవారం మూడో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వరికూటి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు వారి వద్దకు పంపడం జగనన్న తీసుకున్న సాహసోపేత నిర్ణయమన్నారు. గతంలో జన్మభూమి కమిటీల ద్వారా చంద్రబాబు తన పార్టీకి సంబంధించిన వారికే ప్రభుత్వ పథకాలు ఇచ్చారని ఇప్పుడేమో ప్రతి పేదవానిని కోటీశ్వరుని చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎంపీడీఓ షేక్ జమీఉల్లా, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, అల్లూరి యానాది, మాదాల నారాయణ, కాళహస్తి వెంకారెడ్డి, మన్నం వెంకయ్య, వాకా బాలకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

టంగుటూరు: రామస్వామి తిరనాళ్లకు అన్నదాన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇంచార్జి వరికూటి అశోక్‌బాబు 20 బస్తాల బియ్యం రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు చేతుల మీదగా శుక్రువారం అందించారు. మందలపు వెంకయ్య, ఎంపీటీసీ కొమ్ము ప్రభుదాసు, కొండపి ఏఎంసీ డైరెక్టర్ కొమ్ము సురేంద్ర, దుగ్గిరాల పేర్రాజు, తులిబిల్లి అశోక్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: వృద్ధాప్యంలో కూడా వారు సంతోషంగా జీవించేలా చేయడమే తన కర్తవ్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. బింగినపల్లిలో శుక్రవారం వృద్ధులకు చేతి కర్రలు పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. తాను ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత చేతికర్రలు, ట్రై సైకిళ్లు, చెవిటి మిషన్లు అందజేసానని గుర్తు చేశారు. మన్నం వెంకయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుమారు 6 వేల రూపాయల విలువ గల చేతి కర్రలను 12 మందికి వరికూటి స్వయంగా అందజేసారు. ఎంపీడీఓ షేక్ జమీఉల్లా, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, అల్లూరి యానాది, మాదాల నారాయణ, కాళహస్తి వెంకారెడ్డి, తంబు రఘురామయ్య, వాయిల పున్నయ్య, జి. శ్రీహరిరెడ్డి, మేడిద కృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## బాధితులను పరామర్శించిన చింతలచెర్వు



బాధితునికి ఆర్థిక సాయం చేస్తున్న చింతలచెర్వు

పీసీపల్లి: రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెర్వు సత్యనారాయణరెడ్డి శుక్రవారం మండల పరిధిలోని గుంటుపల్లి, పెదయిర్లపాడులో పర్యటించారు. ఈ సందర్భంగా గుంటుపల్లిలో మూలవారిపల్లిలో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వెన్నం భానుప్రియను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి వివరాలు తెలుసుకొని ఆర్థికసాయం చేశారు. అనంతరం అదే గ్రామంలో చాలా కాలం నుండి మంచానికే పరిమితమైన సలోమిని పరామర్శించి ఆర్థికయం అందించారు. అనంతరం పెదయిర్లపాడు గ్రామంలో ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న లెక్కల చలమారెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో నరాల కొండారెడ్డి, చలమారెడ్డి, ఉండేల మనోజ్ కుమార్, నరాల శివకుమార్ రెడ్డి, వీరారెడ్డి, మల్లెల సాయి మనోజ్ రెడ్డి, చీమల దిన్నె వంశి, నరాల కొండారెడ్డి, కాటసాని మాలకొండారెడ్డి, మూలె రమణారెడ్డి, బెజవాడ బ్రహ్మయ్య, కటికల వెంకటరత్నం, మూలె గోపాల్‌రెడ్డి, సత్యంరెడ్డి, లింగారెడ్డి, ఫణీంద్రారెడ్డి, శివారెడ్డి ఉన్నారు.

## నిర్మాణాలు వేగవంతం చేయాలి



వెంకటాయపాలెం జగనన్న కాలనీ పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

టంగుటూరు: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కె. శ్రీనివాసులు సూచించారు. టంగుటూరులోని వెంకటాయపాలెం జగనన్న కాలనీని శుక్రువారం జేసీ శ్రీనివాసులు పరిశీలించారు. లబ్ధిదారులు ఇళ్ల మధ్యకు విష పురుగులు వస్తున్నాయని తెలుపటంతో స్థలాల్లో పిచ్చి చెట్లు తొలగించాలని హౌసింగు అధికారులను ఆదేశించారు. అనంతవరం, వెలగపూడి గ్రామాల్లో జరుగుతున్న రీసర్వేపై రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అధికారి నాగిరెడ్డి, హౌసింగు పీడీ పేరయ్య, డీఈ జయరావు, తహసీల్దార్ సంజీవరావు, హౌసింగు ఏఈ రియాజ్, ఏఈ సుబ్బారావు, ఏపీఎం హనుమంతరావు పాల్గొన్నారు.

జరుగుమల్లి (సింగరాయకొండ): జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు జరుపుకోవాలని ఎంపీడీఓ పి. రామకృష్ణ అన్నారు. జరుగుమల్లి మండలం కె బిట్రగుంట పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకాధికారి గ్రంధి మాధవి, ఈఓఆర్‌డీ శ్రీనివాసరావు, ఏఇ రమేష్, కార్యదర్శి షఫీ పాల్గొన్నారు.

## జెడ్పీ స్థలం గుర్తింపునకు ప్రత్యేక సర్వే



జెడ్పీ స్థలం గుర్తింపునకు సర్వే చేస్తున్న అధికారులు

పొన్నలూరు: పొన్నలూరు పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్లు 264, 265, 266 లోని జెడ్పీ స్థలాన్ని గుర్తించి హద్దులు ఏర్పాటు చేయడానికి శుక్రవారం అధికారులు ప్రత్యేక సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రత్నజ్యోతి మాట్లాడుతూ జెడ్పీ స్థలం ఆక్రమణకు గురై కొన్నేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా గృహాలు నిర్మిస్తున్నారని కొందరు స్పందనలో ఫిర్యాదు చేశారన్నారు. ఈ క్రమంలో కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాలు మేరకు పీఆర్ జేఈ చెన్నకేశవులు ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారుల బృందం సర్వే చేపట్టిందన్నారు. ఈ సర్వేలో ఇప్పటికే జెడ్పీ స్థలంలో కేటాయించిన స్థలం కంటే ఎక్కువగా ఆక్రమణలు జరిగి అక్రమ గృహాల నిర్మించినట్లు గుర్తించామన్నారు. మరో రెండు రోజుల పాటు పూర్తి స్థాయిలో సర్వే చేపట్టి గుర్తించిన అంశాలను తగు చర్యల నిమిత్తం నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

## డయాలసిస్ కేంద్రం పరిశీలన



డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ శుక్రవారం పరిశీలించారు. వైద్యశాల సూపరింటెండెంట్ అబ్దుల్ కలాంతో కలిసి చైర్మన్ గఫార్ మాట్లాడారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో డయాలసిస్‌కు అంతరాయం కల్గినట్లు వైద్యులు వివరించారు. తాత్కాలికంగా రోగులను మార్కాపురం, ఒంగోలు వైద్యశాలలకు తరలించినట్లు తెలిపారు. దీంతో చైర్మన్ వెంటనే విద్యుత్ సిబ్బందిని పిలిపించారు. తక్షణం విద్యుత్ మరమ్మతులు చేయాలని ఏఈని ఆదేశించారు. విద్యుత్ సమస్య పరిష్కారం కాగానే డయాలసిస్ రోగులను కనిగిరి కేంద్రానికి తీసుకుని వస్తామని వైద్య సిబ్బంది తెలిపారు.

## స్వచ్ఛ కనిగిరిలో భాగస్వాములు కండి



అవగాహన కల్పిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: స్వచ్ఛ కనిగిరిలో అందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 9వ వార్డులో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ తడి పొడి, హానీకర వ్యర్థాల సేకరణ గురించి తెలియజేశారు. మూడు రకాల చెత్త బుట్టల వాడకంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. చెత్తను రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో, కాలువల్లో వేయవద్దన్నారు. ఇళ్లల్లో నుంచి వచ్చిన చెత్తను మున్సిపల్ కార్మికులకు అందచేయాలని, లేకుంటే చెత్త రిక్షాలో వేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీ లోకేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ రసూల్, నాగూర్‌వలి, నాగూర్‌బీ, భారతీ, శివ, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్‌లు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పదమూడవ వార్డులోని మదీన మసీద్, మంగలిమాన్యం వీధుల్లో మున్సిపల్ చైర్మన్ గఫార్, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, కౌన్సిలర్ సయ్యద్ రిజ్వాన ఖాలక్‌లు పర్యటించారు. వార్డులోని వీధిలైట్లు, నీటి సమస్యను పరిష్కరించారు. పీతుల దొరువు వద్ద కచ్చా డ్రైన్ ఏర్పాటు చేసి, మురికి నీటి పారుదలకు చర్యలు తీసుకున్నారు. వార్డులో అత్యవసర పనులు నిర్వహణకు చేపట్టాల్సిన ప్రణాళికను తయారు చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, ఏఈ పీవీ కోటేశ్వరరావులను ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీ షంషీర్, రీఫుద్దీన్, వలంటీర్లు, స్థానిక నాయకులు నరసింహ, సయ్యద్ నూర్, నాగరాజు, ఎం కొండయ్య, మస్తాన్ పాల్గొన్నారు.

## అవకతవకలపై విచారణ

సింగరాయకొండ: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం స్పందన అర్జీలపై జెడ్పీ డిప్యూటీ సీఈఓ సి. హనుమంతరావు విచారణ చేపట్టారు. స్థానిక బాలయోగినగర్‌లో పంచాయతీ స్థలం ఆక్రమించి భవనం నిర్మాణం, ప్రత్యేకాధికారుల పాలనలో జరిగిన అవినీతి పై స్పందనలో ఫిర్యాదు చేశారని తెలిపారు.

# రైల్వేలైన్ పనుల ప్రక్రియ వేగవంతం



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ అజయ్‌కుమార్

కనిగిరి రూరల్: నడికుడి కాళహస్తి రైల్వేలైన్ పనుల వేగవంతానికి తగిన క్లియరెన్స్ చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ టి.అజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ యుపుల్లారావు, రెవెన్యూ అధికారులు, రైల్వేశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ అజయ్‌కుమార్ మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో రైల్వేలైన్ పనుల వేగవంతానికి పేరంగుడిపల్లి, శంఖవరం గ్రామాల పరిధిలో మిగిలి ఉన్న ల్యాండ్ క్లియరెన్స్ ప్రక్రియను వేగవంతం చేసి రైల్వే శాఖకు అప్పగించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం సంబంధిత రికార్డులను పరిశీలించారు. అనంతరం రైల్వేశాఖ అధికారులు కనిగిరి ప్రాంతంలో నడికుడి కాళహస్తి రైల్వే లైన్ వెళ్లే మార్గంలోని సమగ్ర నివేదిక, పరిహారం చెల్లింపులకు చివరి దశలో ఉన్న ల్యాండ్ క్లియరెన్స్ ప్రదేశాలు, పనుల పూర్తికి తక్షణం తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై ఆర్డీఓతో చర్చించారు. రైల్వే శాఖ డీఈ, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన



పథకాల లబ్ధిని వివరిస్తున్న పార్టీ నాయకులు

పామూరు: పేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తూ పేదల పక్షపాతిగా నిలిచారని వైఎస్సార్‌సీపీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల సాయికిరణ్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ చల్లా సుబ్బారావు అన్నారు. పామూరులో శుక్రవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకూ వెళ్లి లబ్ధిదారులకు అందిన ప్రభుత్వ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పొందుతున్న సంక్షేమ పథకాలు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వచ్చాయా లేదా అని తెలుసుకున్నారు. టీడీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రజలకు వివరించారు. ఆర్యవైశ్య సంఘ నాయకుడు మంచికంటి మధు, కాపుసంఘం నాయకులు పిడుగు శ్రీనివాసులు, ఫిషర్స్‌కమిటీ జిల్లా నాయకులు ఓగూరి ఏడుకొండలు, వాయినేని రాఘవ, రసూల్, పలువురు వైఎస్సార్ సీపీ పాల్గొన్నారు.

# గాలికుంటు వ్యాధి నివారణకు ఉచిత టీకాలు

కొండపి: స్థానిక ఏడీ కార్యాలయం పరిధిలోని కొండపి, సింగరాయకొండ, పొన్నలూరు మండలాల్లోని 32,300 ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను అందిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ యం. రవికుమార్ విలేకరుల సమావేశంలో తెలిపారు. గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయటం మార్చి 25న ప్రారంభించినట్లు తెలిపారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది ప్రతి ఇంటికి తిరిగి టీకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కొండపిలో 11,900, సింగరాయకొండలో 11,550, పొన్నలూరులో 8,800 గేదెలు, ఆవులకు టీకాలు వేయాల్సి ఉండగా 23,000 గేదెలు ఆవులకు వేయటం జరిగిందని, ఇంకా 9006 గేదెలు ఆవులకు టీకాలు వేయాల్సి ఉందన్నారు. గేదెలు, ఆవులు ఉన్న రైతులు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీకాలు పూర్తిగా ఉచితంగా అందించటం జరుగుతుందన్నారు.

అదే విధంగా ఎద ఇంజక్షన్‌లు సైతం ఏప్రిల్ 1 నుంచి జూలై 31 వరకు ఉచితంగా అందజేస్తామని రైతులు తమ పశువులకు ఉచితంగా అందించుకోవాలని తెలిపారు. అదే విధంగా సెక్స్ సార్టెడ్ సెమన్ అందుబాటులో ఉందని రైతులు 500 రూపాయలు చెల్లించి గేదెలకు వేయించుకోవాలని దీని వలన ఆడదూడ పుడుతుందని తెలిపారు. 500 చెల్లించి సెమన్ ఎక్కించినా ఆడదూడ పుట్టకుండా మగదూడ పుడితే తిరిగి రైతుకు డబ్బు వెనక్కి చెల్లిస్తామని తెలిపారు. రైతులకు 75 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు ఎకరాకు గరిష్టంగా 20 కేజీలు అందించటం జరుగుతుందని తెలిపారు. సబ్సిడీ పోను రైతులు 5 కేజీల బ్యాగుకు రూ. 109.20 చెల్లించి పొందవచ్చని మరో వారం రోజుల్లో స్టాకు వస్తుందని తెలిపారు. కొండపి మండలానికి 3.5 టన్నులు కావాలని ఉన్నతాధికారులకు తెలిపినట్లు కె. ఉప్పలపాడు డాక్టర్ బి. పేరయ్య తెలిపారు.

## ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



పెద్దగొల్లపల్లిలో పక్కా ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

హనుమంతునిపాడు: ఇళ్ల నిర్మాణాలు త్వరతగతిన పూర్తి చేయించాలని ఎంపీడీఓ జీవీ క్రిష్టారావు అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా పెద్దగొల్లపల్లి, నందనవనం, గ్రామాల్లో పారిశుధ్య పనులు, పక్కా ఇళ్ల నిర్మాణాలు, డంపింగ్ యార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి, గ్రామాలు చూడ చక్కని గ్రామాలుగా వీధులు, రోడ్లు, డ్రైనేజీలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇప్పటికీ ప్రారంభించని వారు వెంటనే ప్రారంభించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో అందేలా చూడాలని ఏఈ కొండయ్యకు సూచించారు. వేసవిలో వడదెబ్బ కొట్టకుండా ముందుస్తు జాగ్రతలు పాటించాలన్నారు. హౌసింగ్ ఏఈ కొండయ్య, పంచాయతీ విస్తరణ అధికారి షేక్ షరీఫ్, కార్యదర్శులు రమణయ్య, మాజీ ఎంపీటీసీ సానికొమ్ము వెంకటస్వామిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రూపు సభ్యుల ఆమోదంతోనే రుణాలు



డాక్రా గ్రూపు సభ్యులతో మాట్లాడుతున్న డీపీఎం సుబ్బారావు

సింగరాయకొండ: డ్వాక్రా గ్రూపు సభ్యుల ఆమోదం తోనే ఉన్నతి రుణాలు ఇస్తామే తప్ప అవకతవకలకు పాల్పడితే రద్దు చేస్తామని డీఆర్‌డీఏ డీపీఎం బీఎస్ సుబ్బారావు అన్నారు. కనుమళ్ల పంచాయతీ పెద్ద కనుమళ్ల ఎస్టీ కాలనీలో శుక్రవారం సాయంత్రం దొంగ సంతకాలతో రుణాలు.. కథనంపై డీఆర్‌డీఏ పీడీ బాబూరావు ఆదేశాలతో జిల్లా అధికారులు గ్రూపు సభ్యులతో సమావేశం నిర్వహించారు. కారకురాలైన పద్మ పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. డీపీఎం బీఎస్ సుబ్బారావు మాట్లాడుతూ గ్రూపు సభ్యుల ఆమోదం లేకుండా తీర్మానాలు రాయటానికి వీలు లేదని, సభ్యుల ఆమోదం తోనే రుణాలు ఇస్తామన్నారు. నగదు ఇవ్వలేదని ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం జరగలేదన్నారు. దొంగ సంతకాలతో డ్వాక్రా గ్రూపుల లక్ష్యాన్ని నీరు గార్చిన వీఓఏ పద్మ పై నిజనిర్ధారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. డీపీఎం టి. డేవిడ్, ఉన్నతి ఏపీఎం ప్రసాద్, ఏసీ జి. రాంబాబు, ఏపీఎం డి. జయరాజ్, కెనరా బ్యాంకు మేనేజర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న కమిషనర్ మనోహర్

కందుకూరు అర్బన్: జగనన్న ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి వారు ఇళ్లను త్వరితగతిన నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఎస్. మనోహర్ సూచించారు. పట్టణంలోని ఆరు సచివాలయాలను శుక్రవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పన్నుల బకాయిలను వెంటనే చెల్లించేలా ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.

## 30న రెవెన్యూ సంఘ ఎన్నికలు

కనిగిరి రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సంఘ ప్రకాశం జిల్లా ఎన్నికలు ఈ నెల 30న ఒంగోలులో జరుగుతాయని కనిగిరి రెవెన్యూ డివిజన్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కనపర్తి పద్మనాభం, బసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో శనివారం ఉదయం 10 గంటలకు జరిగే ఎన్నికలు, సమావేశానికి రాష్ట్ర రెవెన్యూ అధికారుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు భూపతిరాజు, రవీంద్రరాజు, అప్పలనాయుడులు హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లా కమిటీ ఎన్నికలకు కనిగిరి రెవెన్యూ డివిజన్‌లోని జిల్లా కమిటీ సభ్యులు, డివిజన్ కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, డివిజన్ పరిధిలోని వీఆర్వోలు అందరూ తప్పక హాజరుకావాలని కోరారు.